క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



ఇల్లంతకుంట: మండలంలోని అనంతారంలో ఆదివారం గ్రామ మహిళా సమైక్య భవనంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, చల్ల నారాయణ, లక్ష్మణ్, కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్లలో తాటిచెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల గౌడసంఘం కన్వీనర్ గజ్జల రాజశేఖర్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడారు. ఎక్సైజ్ అధికారుల అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం అమానుషమన్నారు. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. గీత కార్మికులు నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, నాయిని మల్లేశం, ఎల్లయ్య, దాచారపు పరుశురాం, నాయిని రమేశ్‌గౌడ్, సంఘ సభ్యులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏజీపీ పసుల కృష్ణ ఆకాంక్షించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పందిళ్ల లింగంగౌడ్ ఆదివారం సన్మానించారు. ఏజీపీ పసుల కృష్ణ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో చదివే వారు జీవితంలో ఉత్తమ స్థానాల్లో స్థిరపడతారన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు గుండాడి రాంరెడ్డి, గంట వెంకటేశ్‌గౌడ్, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, గడ్డం జితేందర్, గంట కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముస్తాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రొబెషనరీ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్ పట్టణంలో రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారిని ఆక్రమణలకు గురిచేసి వ్యాపారాలు చేసే వారికి హెచ్చరికలు చేశామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ఇతరులను కూడా ప్రమాదాలకు నెట్టవద్దని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య



ముత్తయ్య (ఫైల్)

చందుర్తి: అనారోగ్యంతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన కొండ ముత్తయ్య (72) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య భాగ్యవ్వ పదేళ్ల క్రితమే మృతిచెందగా చిన్న కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కొడుకు స్వామి ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో మూడెకరాల భూమిని కోల్పోగా జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. ముత్తయ్య బాగోగులను కోడలు చూసుకునేది. అనారోగ్యంతో బాధపడుతున్న ముత్తయ్య ఆదివారం తెల్లవారుజామున ఉరేసుకున్నాడు. మృతుడికి కుమారుడు స్వామి, కోడలుతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. తండ్రి మరణవార్తను బంధువులు, కుటుంబ సభ్యులు స్వామికి ఫోన్‌లో సమాచారం అందించారు.

గుండెపోటుతో మరో వ్యక్తి..

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన దస్తగిరి(65) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. దస్తగిరి గతంలో బహ్రెయిన్‌లో చాలా ఏళ్లపాటు పనిచేసి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. కొడుకు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కోనరావుపేట: కనగర్తిలో విద్యుత్ షాక్‌తో ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన బడె స్వామిదాస్ అనే రైతు తన పశువులను వ్యవసాయ క్షేత్రం వద్ద కట్టేశాడు. ఓ ఆవుకు తాడు ఊడిపోవడంతో రైస్ మిల్లు వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మృతిచెందింది.

లీకేజీతో నీరంతా వృథా

- గైడ్‌వాల్, కెనాల్ పనుల్లో నాణ్యత లోపం
- లింగంకుంట నుంచి బయటకు వెళ్తున్న నీరు
- అడుగంటుతున్న భూగర్భజలాలు



ముస్తాబాద్‌లోని లింగంకుంట నుంచి ఖాళీ అవుతున్న నీరు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని లింగంకుంటలోని నీరు అడుగంటింది. గోదావరి నీటిని మల్లన్నసాగర్ ద్వారా తరలించిడూ ఆ కుంటలో నీటి నిల్వ గగనంగా మారింది. లింగంకుంటలో నీరు ఉంటేనే ముస్తాబాద్ పట్టణంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న లింగంకుంటను అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. సాగు, తాగునీటి ఇబ్బందులను దూరం చేసే లింగంకుంట అభివృద్ధికి గతంలో చేపట్టిన మరమ్మతు పనులు పనికిరావడం లేదు.

పనిచేయని 'మిషన్'

ముస్తాబాద్‌లోని లింగంకుంట అభివృద్ధికి మిషన్ కాకతీయలో పనులు చేపట్టారు. నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో చేసిన పనులు తూతూ మంత్రంగా చేపట్టారని రైతులు వాపోతున్నారు. కట్ట కింద నిర్మించిన గైడ్‌వాల్, కెనాల్ పనుల్లో నాణ్యత లోపించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ కాకతీయ పనులే కాకుండా నీటి పారుదలశాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించి, షట్టర్, గైడ్‌వాల్ పనులు చేపట్టారు. అయినా నీటి నిల్వ లేకుండా పోతోంది. అలా వచ్చి నీరు ఇలా కిందకు వెళ్తోందని రైతులు పేర్కొన్నారు. లింగంకుంటతోపాటు గోదావరి జలాలు వచ్చినా పెద్ద చెరువు, మద్దికుంట చెరువు, చీకొడు, గూడెం చెరువుల్లో అరవై శాతం నీరు ఉంది. ఒక్క లింగంకుంటనే బోసి పోయిందని రైతులు చెబుతున్నారు.

గోదావరి జలాలు వచ్చినా..

లింగంకుంటకు గతంలో రాజక్కపేట ఊర చెరువు ద్వారా ప్రతి వర్షాకాలంలో నీరు చేరేది. వానాకాలం సీజన్‌లో ఎగువనుంచి వచ్చే వరదే లింగంకుంటకు ఆధారం. దీని కింద వంద ఎకరాల ఆయకట్టు ఉన్నా అది సాగులోకి రావడం లేదు. మిషన్ కాకతీయ, ప్రత్యేక ఫండ్ ద్వారా పనులు చేయగా, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు ప్రతి ఆరు నెలలకోసారి లింగంకుంటకు మళ్లిస్తున్నారు. గత నాలుగేళ్లుగా నీటితో కళకళలాడిన, అది కేవలం రెండు నెలలే ఉంటుంది. పూర్తిస్థాయి నీటి మట్టంతో కేవలం రెండు నెలలు మాత్రమే ఉండగా, లీకేజీలతో నీరంతా కింద ఉన్న పెద్ద చెరువులోకి వెళ్తుంది. దీంతో ముస్తాబాద్‌లో భూగర్భ జలాలు అడగుంటుతున్నాయని పట్టణవాసులు పేర్కొంటున్నారు.

రెండు గ్రామాలకు ప్రయోజనం



లింగంకుంటలో నీరు ఉంటే ముస్తాబాద్, పోతుగల్ రైతులకు ప్రయోజనం కలుగుతుంది. గోదావరి జలాలు ఎక్కువ నిల్వ ఉండడం లేదు. నీరంతా కిందకు జాలుతో బయటకు వస్తోంది. దీంతో భూగర్భ జలాలు ఉండడం లేదు. కుంటను కాపాడుకుంటే ప్రయోజనం కలుగుతుంది. – దేవయ్య రైతు

పనుల్లో నాణ్యతా లోపం



పదేళ్ల క్రితం చేపట్టిన లింగంకుంట అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించింది. గోదావరి జలాలు వచ్చినా రెండు నెలలకు మించి నిల్వ ఉండడం లేదు. నీరంతా కిందికి వృథాగా పోతోంది. దీంతో రైతులు బాధపడుతున్నారు.

– వొరగంటి తిరుపతి, మాజీ సర్పంచ్

కుంటను పరిశీలిస్తాం



లింగంకుంటలో గోదావరి జలాలు ఉండడం లేదు. షట్టర్, లీకేజీలతో నీరు కిందకు వెళ్తుంది. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతాం. మరమ్మతు పనులకు ప్రతిపాదనలు చేసి పనులు చేస్తాం. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, డీఈఈ, ముస్తాబాద్

ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి



కోనరావుపేట: మాట్లాడుతున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: ఈనెల 22న జరిగే హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలంలోని ధర్మారం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం హిందూ ఏక్తాయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల ప్రజలు హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణ స్వామి, బైరగోని సురేశ్, ఎడ్ల సుధాకర్, రవీందర్ గౌడ్, తిరుపతి, బూత్ అధ్యక్షులు వేల్పుల మైపాల్, మల్లేశం, విజయ్, శ్రీనివాస్, మల్లేశం, సోముల భాస్కర్ రెడ్డి, పాలకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఈ నెల 22న జరిగే హిందూ ఏక్తాయాత్రకు కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి మల్లారపు సంతోష్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏక్తా యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, నాయకులు కంచర్ల పర్శరాములు, చల్ల సత్యంరెడ్డి, నంది నరేశ్, కిరణ్‌నాయక్, ఆంజనేయులు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం



కోనరావుపేట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇక్కడ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడగాని వెంకటేశ్, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి ప్రభాకర్, వెంకటేశ్, యూత్ నాయకులు అబ్బసాని దినేశ్, వడ్డేపల్లె మధు, ములిగే నవీన్, గడిపెల్లి వినయ్, మాసం జనార్దన్, వేణు రెడ్డి, నవీన్, శేషు, వినయ్, రాజు, గొట్టే ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పుచ్చలపల్లి' వర్ధంతి

సిరిసిల్ల: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్ట్ గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సిరిసిల్లలో సోమవారం జరగనుంది. నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ఆలగానిపాడులో జన్మించిన పీఎస్ రైతాంగ ఉద్యమాల్లో పాల్గొన్నారు. అతని పేరిట సిరిసిల్లలో సుందరయ్యనగర్ (పీ.ఎస్.నగర్) అనే కార్మిక వాడను స్థాపించారు. కమ్యూనిస్ట్ యోధుడిగా సిరిసిల్లలో ఎంతో ప్రభావం చూపిన సుందరయ్య 1985 మే 19న మద్రాసులోని అపోలో ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయన వర్ధంతిని పట్టణంలో సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి-నేరెళ్ల గ్రామ శివారులోని పాల డెయిరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కారు అతివేగంతో కల్వర్టు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియ రాలేదు.

చెట్టు తొలగింపు

ఎల్లారెడ్డిపేట: గుడిపై మొలిచిన రావి చెట్టును తొలగించినట్లు ఆలయ చైర్మన్ గడ్డం జితేందర్ తెలిపారు. ఆలయ అర్చకుల సూచనలతో చెట్టును తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బాలాలయంలో వేణుగోపాలస్వామి దర్శనం, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీలకు డిమాండ్

- పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ
- వేసవిలో నృత్య, యోగా శిక్షణ
- కోడింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు



యోగా చేస్తున్న కేజీబీవీ విద్యార్థులు



నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట చేపట్టడం.. పిల్లల ఇంటికెళ్లడం చూశాం. కానీ జిల్లాలోని కేజీబీవీల్లో సీన్ రివర్స్ ఉంది. తమ పిల్లలను కేజీబీవీలో చేర్చుతాం.. అడ్మిషన్ ఇవ్వండి.. అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాసంస్థల చుట్టూ తిరుగుతున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధించడం.. నృత్యం .. యోగా.. మానసిక వికాసంపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో తమదైన ముద్ర వేస్తున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలపై ప్రత్యేక కథనం.

13 కేజీబీవీలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 13 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. విద్యార్థులకు తరగతిగదిలో పాఠ్యాంశాల బోధనతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ వేసవి సెలవుల్లో స్పోకెన్ ఇంగ్లిష్, కోడింగ్, యోగా, డ్యాన్స్ నేర్పిస్తున్నారు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈనెల 8న మొదలైన ఈ శిక్షణ తరగతులు ఈనెల 22 వరకు కొనసాగనున్నాయి. దాదాపు 100 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరందరికి వసతి, అల్పాహారం, భోజనం ప్రభుత్వమే అందజేస్తుంది.

10 కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణత

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని 13 కేజీబీవీల్లో పది వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు గణాంకాలు ఉన్నాయి. పదో తరగతి పరీక్షలకు 506 మంది విద్యార్థులు హాజరుకాగా 503 మంది ఉత్తీర్ణులై.. 99.41 శాతం నమోదైంది.

కోడింగ్ నేర్చుకుంటున్న



నేను సమ్మర్ క్యాంపులో చేరాను. డ్యాన్స్, యోగా, ఆటపాటలు నేర్పుతున్నారు. ఇప్పుడిప్పుడే కోడింగ్ నేర్చుకుంటున్న. భవిష్యత్ అంతా కోడింగ్‌తో ముడిపడి ఉంటుందని నేర్చుకుంటున్న. మంచిగా నేర్పిస్తున్నారు.

– హర్షిని, ఎల్లారెడ్డిపేట కేజీబీవీ

ప్రత్యేక వలంటీర్లతో తరగతులు



కేజీబీవీ విద్యార్థులకు 15 రోజులపాటు కోడింగ్‌తోపాటు నృత్యం, కరాటే, యోగా, డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. ప్రతీ కేజీబీవీ నుంచి సిబ్బందిని రప్పించి తరగతులు నిర్వహిస్తున్నాం. ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు వలంటీర్లను నియమించాం.

– సీహెచ్.పద్మజ, జీసీడీవో, సిరిసిల్ల సమగ్ర శిక్ష

మానసిక వికాసం



విద్యార్థులు విద్యతోపాటు మానసిక వికాసం సాధించాలనే ప్రణాళికతో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తేనే ఉన్నత చదువుల్లో ప్రతిభ చూపే అవకాశం ఉంటుంది. విద్యార్థులు శ్రద్ధగా నేర్చుకోవాలి.

– జనార్దన్‌రావు, డీఈవో



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో ఆరోగ్య ఉపకేంద్రాన్ని అసౌకర్యాల మధ్య అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలుసార్లు గ్రామస్తులు విజ్ఞప్తిచేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సారియా అంజుమ్, మండల వైద్యాధికారిణి: సెల్ నంబర్: 9010 4943 75

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626





సరదా.. సరదాగా

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సరదాగా క్రికెట్ ఆడారు. క్రికెట్ మైదానం ఏర్పాటుకు మానేరు తీరంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సరదాగా క్రికెట్ ఆడారు. కలెక్టర్ బౌలింగ్ వేయగా.. విప్ ఆది శ్రీనివాస్ బ్యాటింగ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చందుర్తి : సనుగుల పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



వీర్నపల్లి : సమావేశమైన పూర్వ విద్యార్థులు

చందుర్తి : మండలంలోని సనుగుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు మాడుగుల మల్లేశం, గడ్డం దేవయ్య, ప్రకాశ్, దేవనందం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లక్ష్మణ్ అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో సైబర్ నేరాలు, పోక్సో కేసులపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, దొంగతనాలు, మైనర్ డ్రైవింగ్, పోక్సో కేసులు, అపరిచిత వ్యక్తుల సంచారం, గుడుంబా, గంజాయి లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇళ్లకు తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గ్రామ కమిటీల నియామకం



బస్వాపూర్‌లో నియామక పత్రాలు అందజేస్తున్న భాస్కర్ గౌడ్

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్, రామన్నపల్లె గ్రామాల్లో ఆదివారం కేటీఆర్ సేన గ్రామ కమిటీలను నియమించినట్లు మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేన రామన్నపల్లె అధ్యక్షుడిగా జక్కుల జలేందర్, బస్వాపూర్ అధ్యక్షుడిగా పూర్మాని ప్రశాంత్ రెడ్డికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆత్మకూరి చంటి యాదవ్, మాజీసర్పంచ్ రంగయ్య, కర్నె బాలయ్య, మోతె మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం(పురుషులు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ ఆదివారం ప్రకటనలో కోరారు. అర్హులైన విద్యార్థులు వారికి నచ్చిన గ్రూపులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94413 38100, 81063 85402 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బెల్ట్‌షాపులు మూసివేయాలి

ఇల్లంతకుంట: గ్రామాల్లో బెల్టు షాపులను మూసి వేయించాలని సామాజిక ఉద్యమకారుడు ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సావన పెల్లి రాకేశ్ ఒక ప్రకటనలో కోరారు. అధికారంలోకి రాగానే బెల్టు షాపులు మూసి వేయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు.